## క్లుప్తంగా

### ఉపాధి హామీలో అవినీతిపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఉపాధి హామీ కూలీలుబాధితులు

**వింజమూరు (ఉదయగిరి):** వింజమూరు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో కొంతమంది క్షేత్ర సహాయకులు అవినీతికి పాల్పడుతూ తమకు రావాల్సిన కూలి నగదును పక్కదారి పట్టిస్తున్నారని సోమవారం పలువురు ఉపాధి కూలీలు ఎంపీడీఓ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### బడిలో పాము కలకలం



పాఠశాలలో కనిపించిన రక్తపింజరి

**సంగం:** సంగం జెడ్పీ హైస్కూల్లో సోమవారం రక్తపింజరి పాము కలకలం రేపింది. పాఠశాలలోని వంట గదిలో సిబ్బంది గదిని శుభ్రం చేస్తుండగా రక్తపింజరి పాము ఉండడాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే అక్కడే ఉన్న వాచ్‌మెన్‌కు సమాచారం ఇవ్వగా పామును చంపేశారు. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

### జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

**సంగం:** జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీల సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని అధికారులు తెలిపారు. సంగం ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దారు అశోక్, ఎంపీడీఓ గోపి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

### గృహ నిర్మాణాలకు మౌలిక వసతులు



వాశిలి జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

**ఆత్మకూరురూరల్:** జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణశాఖ డీఈ నటరాజ్ చెప్పారు. మండలంలోని వాశిలిలోని జగనన్న కాలనీలో చేపడుతున్న గృహ నిర్మాణాలను సోమవారం ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌తో కలిసి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా బోరు, మోటారు వేయిస్తామన్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం ద్వారా ఇతరత్రా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శరత్, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు

**ఉదయగిరి:** మండలంలోని సంజీవరాజుపల్లిలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో పలువురు గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. రామాంజనేయులు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన సంజీవరాజు కుటుంబంపై దాడి చేశాడు. ఈ దాడిలో సంజీవరాజు, ఎస్.అంజమ్మ, బి.అంజమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహనం ద్వారా వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

### 16న గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**వెంకటాచలం:** నెల్లూరు నగరంలోని టౌన్‌హాలులో ఈనెల 16వ తేదీన జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కరాలు అందిస్తారని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 450 పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తారని తెలియజేశారు.

# భక్తి ప్రపత్తులతో గురుపౌర్ణమి

- మందిరాల్లో కిక్కిరిసిన భక్తులు
- సాయినాథునికి విశేష సుగుంధ ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు
- భారీ స్థాయిలో అన్నదానాలు



ఆత్మకూరు: సుగంధ ద్రవ్యాలతో సాయిబాబా మూలవిరాట్టుకు అభిషేకం చేస్తున్న దృశ్యం



కావలి: విశేష అలంకరణలో సాయినాథుడు



ఉదయగిరి: ప్రత్యేకాలంకరణలో సాయినాథుడు



చామదల సాయినాథుని మందిరంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు



సోమశిలలో సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**ఆత్మకూరు:** సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఊరూరా భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని శివాలయ ప్రాంగణంలోని షిరిడీ సాయిబాబా మందిరం, మెయిన్ బజారులోని సాయినాథుని మందిరంలో వేకువజాము నుంచే విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయిబాబా మందిరంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు పసుపు, కుంకుమ, విభూతి, పన్నీరు, పాలు, పండ్ల రసాలు తదితర పలు రకాల సుగంధ ద్రవ్యాలతో భక్తులతో సామూహికంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో లోకశాంతి కోసం హోమం నవగ్రహ, విష్ణు సహస్రనామాలతో శాంతి హోమం నిర్వహించారు. అనంతరం సాయిబాబా జీవిత చరిత్రను వివరించారు. తదుపరి భక్తుల నుంచి సేకరించిన భిక్షతో భారీ స్థాయిలో అన్న ప్రసాద వితరణ చేశారు. మెయిన్ బజారులోని సాయినాథుని మందిరంలో చేసిన పూలంగిసేవ భక్తులను ఆకట్టుకుంది. ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు.

**సంగం:** సంగంలోని సాయినగర్‌లో కొలువైన సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబాను పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో సాయివ్రతాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఆత్మకూరురూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిమలూరులో సాయిబాబా మందిరంలో గ్రామానికి చెందిన కేంద్ర రక్షణశాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి అభిమానులు, అనుచరులు సాయిబాబాకు విశేష అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. రామస్వామిపల్లి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మురగళ్ల, బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి, గండ్లవీడు, జంగాలపల్లి తదితర గ్రామాల్లో సాయిబాబా మందిరాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

**చేజర్ల (సోమశిల):** అనంతసాగరం మండలంలో పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతసాగరం, సోమశిల గ్రామాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడకలు నిర్వహించారు. సోమశిల కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు చంద్రమౌళి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి**

**కావలి:** పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నీ సాయిబాబా మందిరాలు వేకువ నుంచే భక్తులతో కిటకిటలాడాయి. గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, బాబా కీర్తనలు, భజనలతో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

**వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు**

**ఉదయగిరి:** ఉదయగిరి బీసీ కాలనీలో కొలువైన సాయినాథుని మందిరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తులు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం, పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జలదంకి:** మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాక సాయినాథుని మందిరాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం హోమాలు, అర్చన, హారతి తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, రాత్రి స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలు కనుల పండువగా సాగాయి. చామదలలో వైఎస్సార్‌సీపీ నేతలు వంటేరు హజరత్‌రెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి ఆధ్వర్యంలో, బ్రాహ్మణక్రాకలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. చామదల వశిష్ఠ ఆశ్రమంలో అచలానంద గురువు రాపూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**వింజమూరు (ఉదయగిరి):** వింజమూరు ప్రసన్ననగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

**వరికుంటపాడు:** వరికుంటపాడులోని దత్తసాయి మందిరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే కాకడ హారతితో వేడుకలు ప్రారంభించారు. అర్చకులు స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం, పల్లకిసేవ నిర్వహించారు.

**కలిగిరి:** స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాకు పాలాభిషేకం, హారతి కార్యక్రమాలు జరిపారు. మందిరం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం సాయిబాబా గ్రామోత్సవం నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.

**కొండాపురం:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని కొమ్మిలో షిరిడీ సాయిబాబా మందిరంలో స్వామివానిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాబా కీర్తనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మహిమలూరులో సాయిబాబా మందిరంలో విశేష పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొమ్మిలో ప్రత్యేకాలంకరణలో సాయినాథుడు



సంగం: విశేష అలంకరణలో సాయినాథుడు



కావలి: సాయినాథుడికి విశేష అభిషేకం



ఆత్మకూరు: సాయి మందిరంలో శాంతి హోమం



కలిగిరి: సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకులు

# రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాజారెడ్డి

- మేకపాటి రాజారెడ్డి
- బహిరంగ సభ స్థల పరిశీలన

**ఉదయగిరి:** రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతుందని జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన మీడియా సంస్థలు చేపట్టిన ప్రజాభిప్రాయంలో సుస్పష్టమైందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. ఉదయగిరిలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని సోమవారం రాజారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అద్భుతమైన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజాభిమానం చూరగొంటున్నారన్నారు. ఆయన పాలనకు నిదర్శనం రెండు రోజుల క్రితం జాతీయ సర్వేలో రాష్ట్రంలో ప్రజలు పూర్తిగా వైఎస్సార్‌సీపీకి మద్దతుతో ఉన్నారని వెల్లడైన విషయం గమనించవచ్చన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పరిచయం చేసుకునే పరిచయ కార్యక్రమంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2024లో జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేసే ఉద్దేశంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభకు జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, జిల్లాకు చెందిన మంత్రితో పాటు పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని చెప్పారు. ఆయన వెంట జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నేతలు అక్కి భాస్కర్‌రెడ్డి, ఇటుకుల భాస్కర్‌రెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, ముర్తుజాహుస్సేన్, మట్ల లక్ష్మయ్య, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, చిమిలి రాజేంద్రతో పాటు ఉదయగిరి సీఐ వి.గిరిబాబు తదితరులున్నారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన వలంటీర్ల సమావేశంలో రాజారెడ్డి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై కొంతసేపు మాట్లాడారు. ఈ నెల 6న జలదంకి మండలం జమ్మలపాళెం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

# ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయండి

- కమిషనర్ నాగేశ్వరరావు



సచివాలయంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వరరావు

**ఆత్మకూరు:** మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగంగా చేయాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. ఏసీఎస్ఆర్‌కాలనీ సచివాలయంలో సిబ్బంది, ఆ పరిధిలోని లబ్ధిదారులు, వలంటీర్లతో సోమవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకంలో భాగంగా అర్హులైన వారందరికీ సొంత ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కాలనీ స్థలాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక వసతులు, ఇసుక, సిమెంట్, ఇనుము అందుబాటులో ఉండేలా గృహ నిర్మాణశాఖ సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పొదుపు మహిళలకు ఇళ్ల నిర్మాణ పనులకు తక్కువ వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణం మెప్మా ద్వారా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణ వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ మహేష్, వెల్ఫేర్ రమణారెడ్డి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్

**ఉదయగిరి:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ పొదుపు మహిళలకు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం జరిగిన డ్వాక్రా సంఘాల లీడర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని రకాల పథకాలు అందజేస్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పొదుపు మహిళలు చురుగ్గా వ్యవహరించి అర్హత ఉండి లబ్ధిపొందని వారి కుటుంబాలను గుర్తించి వారిక తగిన ధ్రువపత్రాలు మంజూరు చేయించడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో మహిళాభ్యున్నతికి తోడ్పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరముందని, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో ఉండే మేకపాటి రాజారెడ్డిని కూడా గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ నెల 5న జరిగే రాజారెడి పరిచయ సభకు పొదుపు మహిళలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రసూల్, పలువురు సీసీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన ఎంఈఓలు



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున ఎంఈఓలు

**కావలి:** ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కావలి–1, కావలి–2 ఎంఈఓలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీపై కావలి విద్యాశాఖాధికారులుగా వచ్చిన వీరు ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలిసి పరిచయం చేసుకున్నారు. మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులను వివరించారు. వారి వెంట వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ఉన్నారు.

# కమీషన్ ఇవ్వకుండా మోసం




మాట్లాడుతున్న మారంరెడ్డి వెంకటరెడ్డి

**కావలి:** భూ క్రయవిక్రయాల్లో మధ్యవర్తిగా వచ్చిన కమీషన్ రూ.15 లక్షలు ఇవ్వకుండా జలదంకి మండలం రామవరప్పాడుకు చెందిన మద్దినేని మురళీ మోసం చేశాడంటూ కావలికి చెందిన మారంరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ఆరోగ్యం సరిగా లేక ఆస్పత్రిలో ఉన్న సమయంలో మద్దినేని మురళీ వచ్చి తనకు భూమి ఇప్పిస్తే కమీషన్‌గా రూ.15 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో కావలి రూరల్ మండలం ఒట్టూరుకు చెందిన తన స్నేహితుడు వై.భానురెడ్డి వద్ద 36 ఎకరాల పొలం ఇప్పించినట్లు తెలిపారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత కమీషన్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. యానాది అనే మత్స్యకారుడి వద్ద తన పేరు చెప్పి రూ.36 లక్షలు తీసుకున్నట్లు కూడా తనకు తెలిసిందని వాపోయాడు.

# టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు



కడనూతలకు చెందిన మేకా రవిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీద మస్తాన్‌రావు

**బిట్రగుంట:** బోగోలు మండలం కడనూతలకు చెందిన టీడీపీ నేత మేకా రవి తన అనుచరులతో కలిసి సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. అల్లూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మేకా రవిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# కోలాహలంగా బండలాగుడు పోటీలు



పాతబిట్రగుంటలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

**బిట్రగుంట:** బోగోలు మండలం పాతబిట్రగుంటలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు కోలాహలంగా సాగాయి. స్థానిక షిరిడీ శేషసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులు పోటీలో పాల్గొని సత్తాచాటాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం వరకు పోటీలు ఆద్యంతం కోలాహలంగా సాగాయి.

**ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు**

బోగోలు మండలంలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాతబిట్రగుంట ద్వారకానగర్‌లోని శ్రీషిర్డీ శేషసాయిబాబా మందిరంలో, బోగోలు, విశ్వనాథరావుపేటలోని బాబా మందిరాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# చెత్త సేకరణకు బుట్టల పంపిణీ



చెత్త సేకరణ బుట్టలను అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

**ఆత్మకూరు:** పట్టణంలో పారిశుధ్య పరిరక్షణకు చెత్త సేకరించే ప్లాస్టిక్ బుట్టలు దెబ్బతినడంతో వాటి స్థానంలో నూతన బుట్టలను పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, కమిషనర్ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందికి, సచివాలయాలకు ఈ బుట్టలను అందజేశారు. స్వచ్ఛ ఆత్మకూరును ఏర్పాటులో భాగంగా ఇటీవల ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించి చెత్త సేకరణ బుట్టలు దెబ్బతిన్న విషయం తెలుసుకుని నూతన బుట్టలను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ జే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం

**ఉదయగిరి:** మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం స్థానిక పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, వాణి, సుజన, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకటకృష్ణారెడ్డి, మస్తానయ్య, రఫిలను ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ లక్కు రమణమ్మ, పీఎంసీ చైర్మన్ సుందరరామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

